
సాక్షి ఒడిశా

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,53,215లు, బంగారం 3 గ్రాముల 650 మిల్లీగ్రాములు వెండి 34గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బకాయి జీతాలకు ఆందోళన

బకాయి జీతాల కోసం మిషన్ శక్తి ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. మహిళల పోటెత్తారు. - 8లో



అరకిలో బంగారం దోపిడీ

రాయగడలో దొంగలు రెచ్చిపోయారు. వ్యాపారి వద్ద నుంచి అరకిలో బంగారం దోచుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శీతల వస్త్రాల్లో అలరనాథుడు



శీతల వస్త్రాల్లో బ్రహ్మగిరి అలరనాథుడు

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరిలో కొలువు దీరిన అలరనాథ స్వామి శీతల వస్త్ర ధారణతో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. ఒడొ౦బొ షష్టి నుంచి ప్రముఖ దేవస్థానాల్లో మూల విరాట్లకు శీతల వస్త్ర అలంకరణ చేయడం ఆచారంగా కొనసాగుతుంది. శ్రీ జగన్నాథుని సంస్కృతితో ముడిపడడంతో అలార నాథ స్వామి దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది.

61 వినతుల స్వీకరణ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ పట్నాయక్

రాయగడ: గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం చేపట్టిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అక్షయ కుమార్ ఖెముండి, ఎస్పీ శ్వాతి ఎస్ కుమార్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ 61 వినతులను స్వీకరించారు. వచ్చిన వినతులోతల 46 వ్యక్తి గత, 15 గ్రామసమస్యలపై ఉన్నాయని అధికారులు వెల్లడించారు. వినతులను పరిశీలించి సకాలంలో పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారును కలెక్టర్ పట్వారి ఆదేశించారు. ఇదిలాఉండగా ఇద్దరు నిరుపేదలకు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి 40 వేల రుపాయలను మంజూరు చేశారు.

సినిమా టిక్కెట్ల ధరల పెంపుపై ఫిర్యాదు



ఏడీఎం రాజేంద్రమింజ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మురళీకృష్ణ

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో తెలుగు సినిమాలు ప్రదర్శిస్తున్న థియేటర్ల యాజమాన్యాలు టిక్కెట్ల ధరలు పెంచి ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ గజపతి జిల్లా అధ్యక్షులు పైల మురళీకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఏడీఎం రాజేంద్రమింజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల నాలుగు థియేటర్లలో విడుదలైన పుష్ప-2 తెలుగుసినిమా టిక్కెట్లు రూ.120 నుంచి జీఎస్టీలో కలిపి 200 రూపాయలకు అమ్మారన్నారు. టిక్కెట్‌పై రూ. వంద అని ముద్రిస్తుండగా.. రూ.150 చొప్పున అమ్ముతున్నారని ఆరోపించారు. కొన్ని థియేటర్లలో కనీస సౌకర్యాలు మహిళలకు కరువైయ్యాయని మురళీకృష్ణ ఆరోపించారు. దీనిపై ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున ఆందోళన చేపడతామన్నారు.

90 కలప దుంగలు స్వాధీనం



కలప దుంగలతో పట్టుబడిన నిందితులు

రాయగడ: పికప్ వ్యాన్‌లో అక్రమంగా కలప దుంగలను రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 90 దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించారు. రాయగడ అటవీ శాఖ రేంజర్ కామేశ్వర్ ఆచారి తెలియజేసిన వివరాల ప్రకారం .. స్థానిక కోపరేటివ్ కాలనీ నాలుగో లైన్‌లో కలప దుంగల అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో సిబ్బంది దాడులను నిర్వహించారు. దాడుల్లో వ్యాన్‌తో సహా కలప దుంగలను పట్టుకున్న అటవీ సిబ్బంది నిందితులను నరేష్ కుమార్, గంట రామారావు, సారనాల్ రామకృష్ణలను అరెస్టు చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం



కల్లంలో వరి పంటకు రక్షణ కల్పిస్తున్న రైతు



పొలాల్లో నీట మునిగిన పంట

- కలహండి జిల్లాలో నీట మునిగిన పంటలు

భువనేశ్వర్: కలహండి జిల్లాలో అకాల వర్షం.. అపార నష్టాన్ని కలిగించింది. ఆదివారం ఈ ప్రాంతంలో కురిసిన వర్షంతో రైతులకు నష్టం సంభవించింది. చేతికి అందాల్సిన పంట నీట మునిగింది. తిరిగి ఎండలో ఆరి తేరుకుంటే తప్ప పంట నాణ్యత పట్ల ఏమాత్రం నమ్మకం కుదరదని రైతులు చెబుతున్నారు. వరి కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన ఈ జిల్లాలో ఇంత వరకు మండీలు తెరవక పోవడంతో కోతకు వచ్చిన పంటని కల్లాల్లోనే ఉంచారు. ఇప్పుడు వానకు పంట తడిచిపోతోంది. వరి కొనుగోలు మండీల్లో వరి నాణ్యత పరిశీలన కోసం ప్రత్యేక వ్యవస్థని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో ప్రకటించిన విషయం తెలిసిందే. కలహండి ప్రాంతంలో మండీల ఏర్పాటు జాప్యం కావడంతో గత నెల 29వ తేదీ నుంచి జిల్లాల్లో అక్కడక్కడ కోతలు ప్రారంభించారు. ఇంతలో అకాల వర్షం కుంభ వృష్టి కావడంతో రైతుల ఆశలు నీరుగారాయి. మండీలు తెరిచే సమయానికి పొలాల్లో పంటల పరిస్థితి ఏ మేరకు దిగుబడి వస్తుందోనని రైతులు కలవరపడుతున్నారు.



నీట మునిగిన పంట పరిశీలనలో రైతు

ప్రతి జిల్లాలో వైద్య కళాశాల

- వైద్యులు లేని సామాజిక ఆరోగ్య కేంద్రాలు 375
- త్వరలో 5,014 వైద్యులు, 3 వేల పారా మెడికల్ పోస్టుల భర్తీ
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్



శాసన సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటవుతుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్ తెలిపారు. శీతాకాలం సమావేశాలు పురస్కరించుకుని రాష్ట్ర శాసన సభలో ఆయన ఈ విషయం వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు మెరుగుపరిచేందుకు ఖాళీగా ఉన్న వైద్యులు, అనుబంధ వైద్య పదవులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో 5,000 మంది వైద్యులు, 1,114 వైద్య నిపుణులు, 3 వేల మంది అనుబంధ వైద్య (పారా మెడికల్) సిబ్బందిని నియమించనున్నట్లు మంత్రి వివరించారు.

వైద్యులు లేని సామాజిక ఆరోగ్య కేంద్రాలు

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైద్యులు లేకుండా సామాజిక ఆరోగ్య కేంద్రాలు సీహెచ్‌సీలు మొరాయిస్తున్నాయి. 30 జిల్లాల్లో 375 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరిస్థితి తాండవిస్తుందని సభలో మంత్రి స్పష్టం చేశారు. ఈ పరిస్థితి గంజాం జిల్లాలో అత్యంత తీవ్రంగా కొనసాగడం ఆందోళనకర విషయంగా పేర్కొన్నారు. గంజాం జిల్లాలో అత్యధికంగా 450 వైద్య పదవులు ఖాళీగా ఉండగా 309 ఖాళీలతో మయూర్‌భంజ్ జిల్లా ద్వితీయ స్థానంలో కొనసాగుతుంది.

జిల్లాకో వైద్య బోధన ఆస్పత్రి

రాష్ట్రంలో త్వరలో మెరుగైన వైద్య, చికిత్స సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి జిల్లాలో ఈ సేవలు సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చే దృక్పథంతో ప్రభుత్వం భావి కార్యాచరణ మెరుగులు దిద్దుతోందని మంత్రి సభలో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటవుతుంది. అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయడం పట్ల ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుంది. ఎన్నికల హామీ మేరకు వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. వైద్యుల నియామకంలో ప్రభుత్వం తాజాగా 2 సంస్కరణలు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్కరణల పంథాలో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వైద్య, పారా మెడికల్ సిబ్బంది పోస్టులు భర్తీకి సన్నాహాలు చురుకుగా సాగిస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఆమోదం లభించినట్లు మంత్రి సభలో స్పష్టం చేశారు. త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

రాష్ట్రంలోని 30 జిల్లాల్లో ఒక్కోటి వంతున మెడికల్ కాలేజీలు ఏర్పాటవుతాయి. భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఈ చర్యకు విభాగం పెద్ద పీట వేయడం విశేషం. 2014 తర్వాత నెలకొల్పే ప్రతి 100 పడకల వైద్య బోధన ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 250 కోట్ల నుంచి రూ. 300 కోట్లు ఖర్చు చేస్తుందని మంత్రి తెలిపారు.

రాజ్యసభకు సుజిత్ కుమార్



బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సుజిత్ కుమార్



సుజిత్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన బీజేపీ ప్రముఖులు

- నామినేషన్ దాఖలు

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో పోటీకి సుజిత్ కుమార్ సోమవారం నామినేషను దాఖలు చేశారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఆయన నామినేషను దాఖలు చేయడం విశేషం. బిజూ జనతా దళ్ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం విదితమే. ఇది వరకు మమత మహంత ఇదే తరహాలో బీజేడీ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో బీజేపీ తిరిగి పట్టం గట్టడంతో తన స్థానాన్ని పదిల పరచుకున్నారు. సుజిత్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానాన్ని తిరిగి ఆయనతోనే భర్తీ కాబోతుంది. 2026 సంవత్సరం వరకు సుజిత్ కుమార్ రాజ్యసభ సభ్యత్వం పదవీ కాలం కొనసాగాల్సింది. శాసన సభలో సంఖ్యా గరిష్ఠత గణాంకాల ప్రకారం ఈ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా సుజిత్ కుమార్ గెలుపు దాదాపు తథ్యం. నామినేషను దాఖలు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్య మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. 30 మంది ఎమ్మెల్యేల ప్రతిపాదిత అభ్యర్థిగా సుజిత్ కుమార్ రెండుసెట్ల నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు.

నేటితో ముగింపు

రాజ్యసభ ఉప ఎన్నికకు నామినేషను దాఖలు గడువు మంగళవారంతో ముగుస్తుంది. ఇంతవరకు విపక్షాలైన బిజూ జనతా దళ్, కాంగ్రెసు నుంచి ఏ ఒక్కరు పోటీ కోసం నామినేషను దాఖలు కాలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే సుజిత్ కుమార్ ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. బుధవారం నామినేషన్ పత్రాలను అధికారులు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉంది. అవసరమైతే ఈ నెల 20న ఉప ఎన్నిక పోలింగు జరగాల్సి ఉంది.

ప్రియుడి మోసం..
ప్రియురాలి బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న దేవకి



శ్మశానంలో దేవకి మృతదేహం వద్ద బంధువులు



దేవకి మృతికి శోకిస్తున్న బంధువులు

జయపురం: ప్రేమించిన వాడు పెళ్లికి నిరాకరించడంతో యువతి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో ఘటన జరిగింది. బొయిపరిగుడ సమితి కలాపాద గ్రామంలో యువతి దేవకీ పూజారి డెంగకుసుమగుడ గ్రామానికి చెందిన జొగా బిశాయిలు ప్రేమించుకున్నారు. కొన్ని రోజుల కిందట ఆమెకు పెళ్లి సంబంధం వచ్చింది. దీంతో ఆమె ఆ విషయాన్ని ప్రియుడికి చెప్పి పెళ్లి చేసుకోవాలని కోరింది. కానీ జొగా బిశాయి పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది శనివారం రాత్రి పురుగుమందు తాగేసింది. ఆమెను కుటుంబ సభ్యులు కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆదివారం ఆమె మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కలాపాడ తీసుకువచ్చారు.

మృతదేహాన్ని ముట్టుకోని గ్రామస్తులు..

గ్రామానికి తీసుకువచ్చిన మృతదేహాన్ని స్థానికులు ముట్టుకోలేదు. ఆ యువతి ప్రేమించిన వ్యక్తి కులం, ఆమె కులం వేర్వేరు కావడంతో స్థానికులు అంత్యక్రియలకు సైతం రావడానికి ఒప్పుకోలేదు. దీంతో చాలాసేపు యువతి మృతదేహం శ్మశానంలో దహన సంస్కారాలు లేకుండా అలాగే ఉండిపోయింది. అనంతరం కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే వెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం నిందితుడు జొగా బిశాయిని అరెస్టు చేశారు.

బర్‌గడ్‌లో ఏనుగుల బీభత్సం

- పంటలు ధ్వంసం



పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

భువనేశ్వర్: బర్‌గడ్ ప్రాంతంలో ఏనుగుల గుంపు పొలాల్లో చొరబడి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రధానంగా ఏనుగుల అభయారణ్యం వంటి పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత భయానకంగా తయారైంది. బర్‌గడ్ ప్రాంతంలో భారీ ఏనుగుల గుంపులు పంట పొలాల్లో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. మూడు రోజులుగా పొలాల్లోకి చొరబడిన ఏనుగుల గుంపు అలజడి రేపుతుండడంతో పరిసరాల్లోని ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. గుంపులో 29 ఏనుగులు తిరుగాడుతున్నట్లు గుర్తించారు. డొంగొరా కెరొమాలి, సవిక్టోరియా సాగర్, శనిమాల్, సుకల్ డెరమా, సాలేపల్లి, కెలెండా, జమొపాలి ప్రాంతాల పంట పొలాల్లో ఏనుగుల సంచరిస్తుండడంతో ఈ ప్రాంతీయులు భయాందోళన చెందుతున్నారు.

108 కిలోల గంజాయి పట్టివేత



మత్తిలి పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పోలీసులు ఆదివారం రాత్రి గోవిందపల్లి చెక్ పోస్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ కారులో తీసుకెళ్తున్న 108 కిలోల గంజాయి దొరికింది. ఈ ఘటనలో బీహార్‌కు చెందిన సర్‌ధర్ ఆలామ్, జమీర్ మియాలను అరెస్టు చేశారు. వీరి చత్తీస్‌గఢ్ మీదుగా గంజాయి తరలిస్తున్నారు. దీని విలువ రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

జీఐఈటీఓలో కంప్యూటరింగ్ వర్క్‌షాప్



వేదికపై అతిథులు



హాజరైన విద్యార్థులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వ విద్యాలయం (జీఐఈటీ)లో సోమవారం ఇండియన్ యూనివర్సిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించి వర్క్ షాప్ ప్రారంభమైంది. వారం రోజులు జరిగే వర్క్‌షాప్‌లో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం సహాయ కార్యదర్శి రంజనా పరిహార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటరింగ్ శిక్షణకు సంబంధించి వివరించారు. అకాడిమిక్ అండ్ అడ్మినిస్ట్రేటీవ్ పాత్రను వివరించిన ఆమె విద్యావిధానంలో అంతర్గత గుణాలను పెంపొందించుకోవడం ద్వారా క్వాంటమ్ కంప్యూటరింగ్ ఎంతో సహకరిస్తోందన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రోజురోజుకూ చోటుచేసుకుంటున్న విభిన్న పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీఐఈటీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.వి.జగన్నాథరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రధ్వజ పండ, వర్క్ షాప్ హోస్ట్ డాక్టర్ విదూస్ కుమార్ సాహులు ప్రసంగించారు. వారం రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొనాలని.. దీని ద్వారా కంప్యూటరింగ్‌లో వివిధ సిద్ధాంతాలు, అప్లికెషన్లపై పూర్తి అవగాహన కలుగుతోందని వక్తలు పేర్కొన్నారు.

వైభవంగా మహేంద్రతనయ
మహోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితిలో 'మహేంద్రతనయ మహోత్సవాలు' ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవ జ్యోతిని పట్టుకుని గుసాని నుంచి గురండి వరకూ పాద యాత్ర చేశారు. ఈ పాదయాత్రలో గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, బి.డీ.ఓ. గౌరచంద్ర పట్నాయిక్, ఉపాధ్యక్షురాలు ఎస్.అనసూయాదేవి తదితర విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం గుసాని సమితి కార్యాలయం ఎదుట మహేంద్రతనయ ఉత్సవాలను అధ్యక్షుడు ఎన్.వీర్రాజు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుసాని సమితిలో పలు మహిళా స్వయం సహాయక గ్రూపులు, చేతి వృత్తుల స్టాల్స్‌ను అధికారులు, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ్ తదతరులు సందర్శించారు. అనంతరం మహేంద్ర ఉత్సవాల సందర్భంగా ఒడిస్సీ, కథక్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. రెండు రోజుల పాటు మహేంద్రతనయ మహోత్సవాలు జరుగుతాయని బీడీఓ గౌర చంద్ర పట్నాయిక్ తెలిపారు.



మహేంద్రతనయ ఉత్సవ జ్యోతిని వేదిక వద్దకు తీసుకెళుతున్న బీడీఓ గౌరచంద్ర పట్నాయిక్, చైర్మన్ ఎన్.వీర్రాజు



మహేంద్రతనయ ఉత్సవాలలో సవర నృత్యంలో చిన్నారులు



కళాకారులకు సన్మానిస్తున్న చైర్మన్ ఎన్.వీర్రాజు



గురండిలో ఉత్సవాలకు కలశ జాతర

క్లుప్తంగా

పది లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాతో నిందితుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎక్సైజ్ పోలీసులు సోమవారం ఓఐసీ రమేష్ చంద్ర సాహుకార్ నేతృత్వంలో మల్కన్‌గిరి–బలిమెల ముఖ్య రహదారిలోని టేకుగూడలో పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. చైతు హాల్బా అనే వ్యక్తి సారాను కేన్‌లో పట్టుకుని వెళ్తుండగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఓయూజే నూతన కార్యవర్గం ఏర్పాటు



ఓయూజే నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: ఒడిశా యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఒయుజే) రాయగడ శాఖ కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లాలోని గుణుపూర్‌లో జరిగిన ఆ సంఘం ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షులుగా రంజీత్ పాడి, ఉపాధ్యక్షులుగా సంజయ్ కుమార్ ప్రధాన్, ప్రమోద్ పతి, సురేష్ పాఢి, కార్యదర్శిగా శివప్రసాద్ దొర, సహకార్యదర్శులుగా శ్రీకాంత్ బొలొబాయి, మనోజ్ పాణి, నీలమాధవ పాడి, బి.సతీష్ కుమార్, కోశాధికారిగా సంతోష్ కుమార్ దళాయి నియమితులవ్వగా సంఘం సలహాదారులుగా రాధా కృష్ణ పట్నాయక్, రాజేష్ కుమార్ పట్నాయక్, కె.సోమేశ్వరరావు వ్యవహరించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వినతుల వెల్లువ



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో గుమ్మా బ్లాక్ వృషబ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామ ముఖపరిపాలన, గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ హాజరయ్యారు. ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి గుణనిధినాయక్ విచ్చేశారు. గ్రీవెన్స్ సెల్‌కు భైజల్, గైబ, పోరిడా, వృషబ్ గ్రామ పంచాయతీల ప్రజలు వినతులు అధికారులకు అందజేశారు. 81 వినతులు అందగా.. ఇందులో వ్యక్తిగతం 27, గ్రామ సమస్యలు 45 ఉన్నాయి. వఅటిలో 9 వినతులు అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రీవెన్స్ సెల్‌కు గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, డీఆర్‌డీఏ ఆదనపు పథకాల అధికారి అంశుమాన్ మహాపాత్రో, తహసీల్దార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దారి తప్పించిన గూగుల్ మ్యాప్



గూగుల్ మ్యాప్ మార్గదర్శకంతో దారి తప్పిన బియ్యం రవాణా ట్రక్కు

భువనేశ్వర్: బియ్యం రవాణా చేసేందుకు విశాఖపట్నం నుంచి రాయపూర్‌కు బయల్దేరిన ట్రక్కు దురదృష్టవశాత్తు గూగుల్ మ్యాప్ ప్రభావంతో అడ్డదారిలో చిక్కుకుంది. గతి, గమ్యం గోచరించక గంజాం జిల్లా గజ్జలబాడి ఘాటీ ప్రాంతంలో ఇరుక్కుంది. ఎటూ కదలలేని పరిస్థితిలో ఈ మార్గంలో రాకపోకలు చేసే వాహనాలకు అడ్డంకిగా పరిణమించడంతో స్థానికులు ఇక్కట్లకు గురయ్యారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక(మీకోసం)లో భాగంగా అర్జీదారుల నుంచి ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 71 అర్జీలు స్వీకరించగా, వీటిలో రెవెన్యూ – 28, పంచాయతీరాజ్ – 5, సర్వే అండ్ లాండ్ రికార్డులు – 4, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పవర్టీ – 3, ఏపీ టిడ్కో – 3, ఏపీఈపీడీసీఎల్ – 3, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ – 2, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు – 2, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ – 2, స్కూల్ ఎడ్యుకేషన్ – 2, ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ – 2, మహిళా శిశు సంక్షేమ శాఖ – 2, రూరల్ డవలప్‌మెంట్ – 2, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ – 2, ట్రెజరీ, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజీ, రిజిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, సాంఘిక సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, విభిన్న ప్రతిభావంతులు శాఖలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ స్వీకరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ అప్పారావు, జెడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజ ఉన్నారు.

సాధించాలనే పట్టుదల ఉండాలి

- జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



జిమ్నాస్టిక్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: సాధించాలన్న పట్టుదల, ధృడ మనోశక్తి ఉండాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల ముగింపు ఉత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం పూల్‌బెడలో గల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిమ్నాస్టిక్ పోటీలు ముగిసిన అనంతరం జరిగిన బహుమతుల ప్రాదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలో ఎంతో శక్తి ఉందని, ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారన్నారు. జిమ్నాస్టిక్ పోటీల్లో 7 జిల్లాల నుంచి 80 మంది పాల్గొన్నారు. 12 ఏళ్ల లోపు వయసు బాలురులో ప్రియమ్ మల్లిక్ ప్రథమ, పూరీ అజయ కుమార్ దాస్ ద్వితీయ, శ్యామ ఛొటాయి తృతీయ స్థానాలలో నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. 14 ఏళ్ల కన్నా తక్కువ వయసు లోపు బాలురుకు నిర్వహించిన పోటీల్లో పూరీ వాసి శుభమ్ ఖొర, అభిజిత్ ప్రధాన్, సిద్దేశ్వర దాస్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. 12 ఏళ్ల వయసు లోపు బాలికల పోటీల్లో భూమిక రెడ్డి, రెషమ్ ఖాన్, సామిలి బోష్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 15 ఏళ్ల వయసు కన్నా తక్కువ బాలికలకు నిర్వహించిన పోటీల్లో ప్రియాంశ బొంసల్, రశ్మిత బెహెర, ధనలక్ష్మీరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. పోటీల బహుతుల ప్రదానోత్సవంలో జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌర్య రెడ్డి, జయపరం సబ్ డివిజన్ అథెలిటిక్ అసోసియేషన్ కార్యదర్శి రొబి నాయక్, రాకేష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు నకిలీ మావోయిస్టులు అరెస్టు



చిత్రకొండ పోలీసులు అరెస్టు చేసిన నకిలీ మావోలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలో ఐదుగురు నకిలీ మావోయిస్టులను సోమవారం చిత్రకొండ పోలీసులు అరెస్టు చేశారు. చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా బోడపోధర్ పంచాయతీ లాంబసింగ్ గ్రామానికి చెందిన భక్తరామ్ సీసా అనే వ్యక్తి జగ్గబంద్ హంతాల్, లక్ష్మీనాథ్ పంగిపై వారం రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తరామ్ సీసా మొహిపోధర్ పంచాయతీకి అదనపు సర్పంచ్‌గా ఉన్నారు. జగ్గబంద్ కూడా మాజీ అదనపు సర్పంచ్. నారాయణ అనే వ్యక్తి జగ్గ హంతాల్ మంచి స్నేహితులు. ఈ ఇద్దరూ కలిసి చిత్రకొండ ప్రాంతంలో పలు కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. జగ్గ చేస్తున్న పనుల్లో నాణ్యత లేదని స్థానికులు భక్తరామ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు విచారణ ప్రారంభించారు. మల్కన్‌గిరి సమితి పద్మాగిరి గ్రామానికి చెందిన వినోద్ జేన, ఉమాకాంత్ మారేవ్‌లను మావోలుగా పరిచయం చేసి కొందరి వద్ద రూ.50వేలు తీసుకున్నారు. ఇకపైనా డబ్బులు ఇవ్వాలని బెదిరించినట్లు పోలీసు విచారణలో తెలిసింది. దీంతో పోలీసులు ఎం.నారాయణ, వినోద్ జేన, ఉమాకాంత్ మారేవ్, జగ్గు, లక్ష్మీనాథ్‌పంగిలను అరెస్టు చేశారు.

జాతీయస్థాయిలో మెరిసిన కిశోర్ చంద్రరథ్

- రెండు బంగారు, సిల్వర్ పతకాలు సొంతం చేసుకున్న వైనం



కిశోర్ చంద్రరథ్‌కు పతకాలు అందజేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: ఆరో జాతీయ సీనియర్ సిటిజన్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలలో గజపతి జిల్లాకు చెందిన విశ్రాంత ఎక్సైజ్ ఏఎస్పై కిశోర్ చంద్రరథ్ సత్తాచాటారు. రెండు బంగారు, ఒక సిల్వర్ పతకం సాధించి ఆదర్శంగా నిలిచారు. తెలంగాణాలోని సికింద్రాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరో జాతీయ సీనియర్ సిటిజన్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఒడిషా రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఆథ్లెటిక్ విభాగంలో పాల్గొన్నారు. వీరిలో ఇద్దరు ప్రతిభకనబర్చారు. వీరిలో పర్లాకిమిడికి చెందిన కిశోర్‌చంద్ర రథ్ ట్రిపుల్ జంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమంగా నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకోగా, 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాన్ని పొందారు. కిశోర్ రథ్ ఓపెన్ చాపియన్ షిప్‌లో విజయం సాధించడంపై ఒడిశా సాహిత్య అకాడమీ మాజీ సభ్యులు, బిచిత్రానంద బెబర్తా, దేవేంద్ర దాస్, వాసుదేవ దాస్, టుకునా బెహేరా అభినందనలు తెలియజేశారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా



కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు మొత్తం లోపభూయిష్టంగా ఉందని, ఈ ప్రక్రియ మొత్తం పునః సమీక్షించాలని ఆమదాలవలస నియోజకవర్గ రైతులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌లు కోరారు. ఈ మేరకు జెడ్పీలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం సోమవారం అందజేశారు. నీటి సంఘాల ఎన్నికల కోసం అధికారులు తయారు చేసిన ఓటర్ల జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయని, వాటికి సంబంధించిన రుజువులు అందజేశారు. జాబితాలో అనేక పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు నమోదై ఉన్నాయన్నారు. ఒకే ఓటర్ పేరు ఒకే సంఘంలో, ఒకే ప్రాదేశికంలో రెండు మూడుసార్లు నమోదు కావడం వలన ఓటుహక్కు వినియోగంలో అనేక ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఓటర్లకు ఎన్నిక గురించి ఎటువంటి సమాచారం లేదన్నారు. పరిశీలనలో ఉన్న చేతులు ఎత్తే ఎన్నిక విధానం వలన సరైన ఓటర్ తీర్పు రాదని గ్రహించాలన్నారు. స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆయనతో పాటు ఆమదాలవలస, పొందూరు మండలాల నాయకులు, పైడి పోలయ్య ఉన్నారు.

సమాజ సేవకురాలికి సిటిజన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న రాజేశ్వరి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న సేవా సమాజం కార్యదర్శి, సమాజ సేవకురాలు రాజేశ్వరి దలాయికి సిటిజన్ అవార్డు లభించింది. రాజధాని భువనేశ్వర్‌లో ఓ ప్రైవేటు చానల్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు సిటిజన్ అవార్డును ప్రదానం చేశారు. సమాజ సేవా రంగంలో నిరంతరం కృషి చేస్తున్న ఆమెకు అవార్డు లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. రాజధానిలో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కనకవర్దన్ సింగ్ దేవ్, రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పద్మశ్రీ స్వర్గీయ శాంతీ దేవి, గాంధేయ వాది డాక్టర్ రతన్ దాస్ ఆదర్శాన్ని తీసుకున్న రాజేశ్వరి గత 27 ఏళ్లుగా సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. భూధాన్ ఆందోళన, మద్యపాన నిషేధం వంటి ఆందోళనలో తమవంతు పోరాడిన రాజేశ్వరి సేవలను గుర్తించిన సంస్థ ఈ మేరకు ఆమెకు అవార్డును అందించి సత్కరించింది.

జగన్నాథ్ సాగర్‌ను అభివృద్ధి చేయాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

జయపురం: జయపురంలో చరిత్రాత్మక జగన్నాథ్ సాగర్ అభివృద్ధిలో జరుగుతున్న జాప్యాన్ని ముఖ్యమంత్రి మోహాణ మఝి దృష్టికి తీసుకు వెళ్లాలని జగన్నాథ్ సాగర్ సురక్ష కమిటీ జయపురం నిర్ణయించింది. సోమవారం స్థానిక జైన్ మందిర ప్రాంగణంలో కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించి సుదీర్ఘంగా చర్చించింది. 20 మందికి పైగా ఆధ్యాత్మిక, 20 మందికి పైగా సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి రజనీకాంత్ నాయక్ అధ్యక్షత వహించారు. జగన్నాథ్ సాగర్ పరిరక్షణ కోసం పట్టణంలో ప్రతీ వార్డులో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాగర్ సరిహద్దులను నిర్ణయించాలని, అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ వర్గాల ఆక్రమణలను తొలగించాలని, డీపీఆర్ లేకుండా సాగర్ పునరుద్ధరణ, సౌందర్యీకరణ పనులు చేపట్టవద్దని, అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సలహాలతో పనులు జరపాలని డిమాండ్ చేశారు. సాగర్ సంపూర్ణ అభివృద్ధిని డిమాండ్ చేస్తూ జయపురం బంద్ జరపాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టణ ప్రధాన మార్గంలో మాత్రమే బంద్ జరపాలని తీర్మానించారు. మున్సిపాలిటీ సక్రమంగా పనులు చేయకపోతే ఆందోళన జరుపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బ్రజరాజ్ మదల, బీర ప్రసాద్, కె.తిరుపతి పాత్రో, నిరంజన్ మిశ్ర, హరిహర కరసుధా పట్నాయక్, మీణకేతన దాస్, కాలూరాం పండా, నిరంజన్ పాణిగ్రహి, సతీష్ నంద, ఉషారాణి మహాపాత్రో, జానకీ పాణిగ్రహి, ఝును పండా, సూర్యనారాయణ పండా, లలిత అగర్వాల్, శంకర ప్రహరాజ్, తాపస్ పండా, రబి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన ద్విచక్ర వాహనం, సారా ప్యాకెట్లు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి సారా ప్యాకెట్లను ఆంధ్రాకి తరలిస్తుండగా ఒడిశాకి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో లావణ్య దొళాయి అనే వ్యక్తి తన స్కూటీపై 300 ప్యాకెట్ల సారా తీసుకొస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో సారా ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, లావణ్య దొళాయిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నాటుసారా అక్రమ రవాణా, తయారీపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మద్యాన్ని ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేటుకు అమ్మినట్లయితే 94408 30285 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

16న అసెంబ్లీ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న ప్రమోద్ హమంతి

జయపురం: ఈ నెల 16వ తేదీన రాష్ట్ర విధానసభ ఎదుట ధర్నా జరపాలని గగణాపూర్ సేవా పేపరు మిల్లు కార్మికులు తీర్మానించారు. సోమవారం స్థానిక కార్మిక భవనంలో సేవా పేపరు మిల్లు కార్మిక సంఘం, విశ్రాంత కార్మికులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ధర్నాలో పేపరు మిల్లులో పనిచేస్తున్న కార్మికులు 30 మందితోపాటు విశ్రాంత కార్మికులు పాల్గొంటారని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి వెల్లడించారు. మూతపడి ఉన్న సేవా పేపరు మిల్లును పూర్తిస్థాయిలో నడపాలని, శ్రామికుల, విశ్రాంత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల, కార్మిక మంత్రులను కలిసి వారికి సేవా పేపరు మిల్లు కార్మికుల సమస్యలు, మిల్లు యాజమాన్య పరిస్థితులపై వివరిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి మోహన్ చంద్ర మఝిను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రహ్లాద మల్లిక్, అనేఖ్ పాత్రో, కె.సత్యనారాయణ, ప్రమోద్ తివారీ, తదితరులు పాల్గొన్నారు.

అరకిలో బంగారం దోపిడీ



సాహు జుయలరీ షాపు



సీసీ కెమెరాలో గుర్తించిన దుండగులు

రాయగడ: ఒక బంగారు వ్యాపారి నుంచి అరకిలో బంగారం ఆభరణాలు గల బ్యాగును గుర్తు తెలియని దుండగులు లాక్కువెళ్లిపోయిన సంఘటన జిల్లాలోని మునిగుడ సమితి అంబదొలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి సమీపంలో గల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. అంబొదలలొ సాహు జుయలరీ దుకాణం యజమాని సంతోష్ కుమార్ సాహు ఎప్పటిలాగే తన ఇంటి నుంచి అరకిలో బంగారు ఆభరణాలను ఒక బ్యాగులో ఉంచి దుకాణానికి తీసుకెళ్తుండగా అక్కడే కాపు కాసిన ఒక దుండగుడు అతని చేతిలో బ్యాగును లాక్కుని పరారయ్యాడు. వేరే ప్రాంతంలో మరో వ్యక్తి బైకుపై ఉండటంతో ఇద్దరూ కలిసి పారిపోయారు.

బకాయి జీతాల కోసం ఆందోళన



రణరంగంగా మారిన దిగువ పీఎంజీ ప్రధాన మార్గం



ఆందోళనలో డిమాండ్ల నినాదాల పతాకం ప్రదర్శన

భువనేశ్వర్: బకాయి జీతభత్యాల విడుదల నినాదంతో మిషన్ శక్తి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు వీధికి ఎక్కారు. శాసన సభలో శీతాకాలం సమావేశాలు జరుగుతున్న తరుణంలో మహిళలు వీధికి ఎక్కడం కలకలం రేపింది. మిషన్ శక్తి అధీనంలో సేవలు అందిస్తున్న పలు వర్గాల మహిళలు ఆందోళన బాట తొక్కారు. వీరి ఆందోళనతో స్థానిక దిగువ పీఎంజీ ప్రాంతం కిటకిటలాడింది. ఆందోళనకారుల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఈ పరిసరాలు మారు మోగాయి. మిషన్ శక్తి కార్యక్రమం కింద ఎంబీకే, బ్యాంకు మిత్ర, కృషి మిత్ర, ప్రాణి మిత్ర వంటి వర్గాలుగా సేవలు అందిస్తున్న మహిళలు ఏప్రిల్ నెల నుంచి తమ జీత భత్యాలు పొందక అల్లాడుతున్నారు. తక్షణమే వీరందరికి బకాయి జీతభత్యాలు చెల్లించాలని ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనపై సోమ వారం సభలో జరిగిన శీతా కాలం సమావేశాల్లో ఉభయ అధికార బీజేపీ, విపక్ష బీజేడీ సభ్యులు వాగ్యుద్ధానికి దిగారు. ఈ ఏడాది మార్చి నెల నుంచి వీరి జీతభత్యాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. ఎంబీకే, బ్యాంకు మిత్ర, జీవికా సహాయికా మహిళా స్వయం సహాయక బృందాల జీతం రూ.6,750 నుంచి రూ.10,750కి, కృషి మిత్ర, ప్రాణి మిత్ర వర్గీయుల జీతం రూ.3,750 నుంచి రూ. 6,250కి పెంచుతామని ప్రభుత్వం ప్రకటించి కనీస జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తోందని దుయ్యబట్టారు.

45 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



డెరిగాంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు



హతిబడి ప్రాంతంలో గంజాయి మొక్కలను దగ్ధం చేస్తున్న దృశ్యం

రాయగడ: గంజాయి సాగును అరికట్టేందుకు పోలీసులు ముమ్మరంగా దాడులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయగడ జిల్లాలోని గుడారి సమితి హతిబడి, డెరిగా అటవీ ప్రాంతాల్లో అక్రమంగా సాగవుతున్న గంజాయి వనాలపై ఆదివారం దాడులను నిర్వహించారు. అబ్కారీ, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 15 ఎకరాల విస్తీర్ణంలోని 45 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వాటికి నిప్పుపెట్టి తగులబెట్టారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

క్లుప్తంగా

డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

పాలకొండ: రేషన్ డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 21 రేషన్ డీలర్ పోస్టులకు గాను శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. భామిని మండలంలో 5, జియ్యమ్మవలస మండలంలో 3, కురుపాం మండలంలో 1, పాలకొండ మండలంలో 5, వీరఘట్టం మండలంలో 7, పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హత గల వారు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత చౌకధరల దుకాణం పరిధిలో ఉండాలని, ఇంటర్మీడియట్ విద్యార్హత ఉండాలని, 18ఏళ్ల నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. అర్హత గత డ్వాక్రా గ్రూపులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

140 సారా ప్యాకెట్ల పట్టివేత

సాలూరు: పాచిపెంట మండలంలోని గోకడవలస వద్ద ఓ వ్యక్తి దగ్గర 140 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జి.దాసు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అక్రమంగా బెల్ట్ షాప్‌ల నిర్వహణ, సారా విక్రయం, తరలింపుపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఈ తనిఖీలు, దాడులు మరింత ముమ్మరం చేస్తామని, చట్టాలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మక్కువలో 200 సారా ప్యాకెట్లు

మక్కువ: మండలంలోని మేలాపువలస జంక్షన్ సమీపంలో కన్నంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరలిస్తున్న 200 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఒడిశా నుంచి సారా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, మాటుకాసి నిందితుడిని అదుపులోకి తీసు తీసుకున్నామని తెలిపారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సాలూరు జ్యుడీషియల్ కోర్టుకు తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

నెల్లిమర్ల: పట్టణంలోని డైట్ కాలనీ పరిధిలో గంజాయి పీలుస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గోడ వెనుక బహిరంగ ప్రదేశంలో గంజాయి పీలుస్తున్న ముగ్గురిని పోలీసులు గుర్తించారు. అనంతరం ఎస్సై బి.గణేశ్ సిబ్బందితో కలిసి రైడ్ చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి దగ్గర లభ్యమైన 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. డైట్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి, ఊటగెడ్డకు చెందిన మరో వ్యక్తి, కోరాడపేటకు చెందిన ఇంకో వ్యక్తి స్నేహితులని, వారు గంజాయి వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

రెండు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద ముగ్గురు అనుమానిత వ్యక్తులను పట్టుకుని తనిఖీ చేయగా వారి దగ్గర సుమారు రెండు కిలోల గంజాయి లభించిందని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. కంటోన్మెంట్ వద్దనున్న బొగ్గులదిబ్బ ప్రాంతంలో నివసించే జ్యోతిప్రసాద్, విశాఖ జిల్లా పద్మనాభం మండలం పొట్నూరులో నివసించే ఆబోతుల భోగేశ్వర్‌లు ఒడిశా రాష్ట్రంలోని జగత్‌సింగ్ పూర్ నుంచి విజయనగరం వచ్చి షేక్ ఇంతియాజ్ అలీకి సుమారు రెండు కిలోల గంజాయిని అమ్ముతుండగా పక్కా సమాచారంతో వారిని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై రామగణేష్‌లు వారిని అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేసి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రకటనలో కోరారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకు..
పోరాటం ఆగదు



ఆందోళన చేస్తున్న గిరిజన అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్పష్టీకరణ
- పోలీసులు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం
- కలెక్టరేట్ ముఖద్వారం వద్ద బైఠాయింపు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: కూటమి ప్రభుత్వం దిగి వచ్చి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం ఆగదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన ఔట్‌సోర్సింగ్, ఉపాధ్యాయులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జాబు కావాలంటే బాబు రావాలి అన్నవారి పాలనలో గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల జాబులు పోయే పరిస్థితి కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పోస్టులు మినహాయించి డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెంనాయుడికి సమస్యను వివరించేందుకు వెళ్లిన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దే ఆందోళన చేస్తూ బైఠాయించారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన గిరిజనులు

ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడికి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగభద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి దృష్టికి సమస్య తీసుకు వెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, శోభారాణి, యమున, గున్నమ్మ, ఉమారాణి, కల్యాణి, జ్యోతి, రాజేష్, దివాకర్, వెంకట్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి

గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలను మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు మూడడ్ల కృష్ణమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ గిరిజనులతో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామని ప్రకటనలు ప్రభుత్వం గుప్పిస్తున్నప్పటికీ ఆచరణలో కానరావడం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం నుంచి గిరిజనులకు ఎలాంటి ప్రోత్సాహకాలు కూడా అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతోపాటు జీఓ నెంబర్ 3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ములగ, సంగంవలస, వెలగవలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, అధికారుల సమష్టి కృషి, సహకారంతో జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 శాతం గిరిజనులు ఉండే ఈ ప్రాంతం పూర్తిగా పేదరికంతో కూడిన జిల్లా అన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలపై దృష్టి సారించడం కన్నా, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ కనీస మౌలికవసతులులేని గ్రామాలపై దృష్టి సారిస్తే కొంత సార్థకత ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటికీ చాలా గ్రామాలకు రహదారి సదుపాయం లేదని, ఆరోగ్యం బాగాలేకపోతే డోలీ మోతలు తప్పకపోవడం విచారకరమన్నారు. త్వరలో అన్ని మండలాల్లో రోడ్లు సదుపాయం లేని గ్రామాలను గుర్తించి, రానున్న రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే తన ముందున్న ప్రధాన ధ్యేయమని చెప్పారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

రానున్న ఐదేళ్లలో ప్రధానమంత్రి సుజల యోజన పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని త్వరలో జిల్లాలో అమలుచేస్తామని, ఇందులో భాగంగా రూ.140కోట్లతో ఆధునిక వ్యవసాయ పనిముట్లు రైతులకు పంపిణీ చేయనున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక రాజేశ్వరి, ట్రైకార్ చైర్మన్ బొరగాం శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురామ్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం మునిసిపల్ చైర్మన్ బి.విజయగౌరి, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ.మాధవరెడ్డి, జేసీ ఎస్.ఎస్. శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారుపేట సమీపంలో..
ఘోర రోడ్డు ప్రమాదం

- ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్
- వ్యాన్‌లో మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనం



మంటల్లో చిక్కుకొని సజీవ దహనం అయిన డ్రైవర్



మంటల్లో అగ్నికి ఆహుతి అవుతున్న వ్యాన్

పూసపాటిరేగ: భోగాపురం మండలం నారుపేట సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ఇసుక లారీని వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఆయిల్‌ట్యాంకర్ పేలి వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్న రెండవ డ్రైవర్(క్లీనర్) కాళ్లు ఇంజిన్‌లో చిక్కుకుపోవడంతో మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

ఒడిశా నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్ వెళ్తున్న వ్యాన్ భోగాపురం మండలం నారుపేట సమీపంలో జాతీయరహదారిపై ముందు వెళ్తున్న ఇసుక లారీని బలంగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ ఆయిల్ ట్యాంకర్ పేలి ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తప్పించుకోగా, వ్యాన్‌లో ఉన్న మరో డ్రైవర్ (క్లీనర్) షేక్ ఆరీఫ్ కాళ్లు ఇంజిన్‌లో చిక్కుకు పోవడంతో ప్రమాదం నుంచి బయటపడలేకపోయాడు. రక్షించండంటూ హాహాకారాలు పెట్టినా ఎవరూ దగ్గరకు వెళ్లలేకపోయారు. మంటలను అదుపుచేయలేకపోవడంతో అందరూ చూస్తుండగానే సజీవదహనమయ్యాడు. పోలీసులు సమాచారం ఇచ్చిన వెంటనే అగ్నిమాపక యంత్రం వస్తే డ్రైవర్ ప్రాణాలు నిలిచేవని స్థానికులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. భోగాపురం ఎస్‌ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న ప్రమాదాలు

భోగాపురం నుంచి రాజాపులోవ మధ్య వరుసగా ప్రమాదాలు జరగడంతో వాహన చోదకులు హడలిపోతున్నారు. గతవారం రోజుల కింద అక్కడకు కొద్ది దూరంలో కారు బోల్తా కొట్టడంతో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. ఇది మరువకముందే రోడ్డు ప్రమాదంలో అందరూ చూస్తుండగానే డ్రైవర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనం కావడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అగ్నిమాపక స్టేషన్ పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఏర్పాటు చేస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయని, ప్రమాదాల సమయంలో ఆదుకునేవారే కరువయ్యారని స్థానికులు నిట్టూర్చుతున్నారు.

98 మద్యం బాటిల్స్ స్వాధీనం

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో అనుమానస్పదంగా ఉన్న రెండు ఇళ్లల్లో సోదా చేసి 98 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఒక ఇంటిలో 52మద్యం బాటిల్స్‌తో పాటు మద్యం అమ్మిన రూ.7,150నగదు స్వాధీనం చేసుకోగా, మరో ఇంటిలో 46 మద్యం సీసాలు దొరికాయని, విక్రయిస్తున్న వ్యక్తి తప్పించుకుని పారిపోయాడని ఎస్సై చెప్పారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు.

వినతులకు వెంటనే పరిష్కారం

- లాగిన్‌లో పెండింగ్ ఉండరాదు
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



పార్వతీపురంటౌన్: సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ డా. ఒ.దిలీప్ కిరణ్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన కాలంలో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు ఇంకా ఉన్నాయని, అవి ప్రతి సోమవారం సాయంత్రానికి సున్నాగా ఉండాలని సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి కలెక్టర్ అంబేద్కర్ 94 వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని అన్నిటిని వెంటనే పరిష్కరించి సరైన సమాధానాలు రాసి రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆదేశించారు. గంటగంటకు పీజీఆర్ఎస్ పెండింగ్ వివరాలను మానిటర్ చేయాలని డీఆర్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్‌తో పాటు జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కోర్టుల్లో ఫైల్ అయిన కేసులకు వెంటనే స్పందించాలి

హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఫైల్ అయిన కేసులను కోర్టు వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ తనిఖీ చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ అన్నారు. జిల్లాకు సంబంధించి రెవెన్యూ ఇతర శాఖలకు చెందిన కేసులేమైనా నమోదయ్యాయా? కోర్టు ఆర్డర్స్ పడ్డాయా అనే విషయాలను తనిఖీ చేసి వెంటనే నోడల్ అధికారి పంపించనున్నట్లు తెలిపారు. అలాగే సంబంధిత ప్రభుత్వ ప్లీడర్‌కు 24 గంటల్లో ఇన్‌స్ట్రక్షన్ పంపించి కాపీని తనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కోర్టు ఆర్డర్స్ పడితే సంబంధిత అధికారులతో వెంటనే కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలని కంటెంప్ట్‌కు అవకాశం ఇవ్వకూడదని కోరారు. ప్రతి శనివారం జిల్లా మొత్తం కేసుల వివరాలను తనకు సమర్పించాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో కలెక్టర్ అంబేద్కర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎస్పీకి 27 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 27 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఎ.లీలారావు, ఆర్ వీఆర్‌కే.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 5 ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు, డీసీఆర్‌బీ సీఐ, వీసీసీఎం ఎర్రంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 31 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 31 వినతులు వచ్చాయి. ఓంద్రుజోలకు చెందిన సవర వెంకటరావు తమ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు వీలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. పులిపుట్టి, వెంపలగూడ, బూర్జమానుగూడకు చెందిన గిరిజనులు తమ భూములను సబ్‌డివిజన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. భరణికోట గ్రామానికి రోడ్డు నిర్మించాలని అక్కడి గిరిజనులు కోరారు. తామరగూడ, రెంగూడ, జన్నిగూడ, అల్తి గ్రామాలకు మినీ అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో నారాయుడు, సీడీపీవో రంగలక్ష్మి, హెచ్‌వో జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాటి మాటలు.. నీటిమీద రాతలేనా..?

- మంత్రి సంధ్యారాణి తీరుపై గిరిజనుల విమర్శలు

సాలూరు రూరల్: 'మండలంలోని ఏజెన్సీలో ప్రభుత్వ పాఠశాలలు పాకల్లో నడుస్తున్నాయి. మేము అధికారంలోకి రాగానే పాఠశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాం' అని సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి ఊదరగొట్టిన ప్రగల్బాలు ప్రస్తుతం ఆమె పూర్తిగా మరిచిపోయారా? లేక ఆదమరిచారా? అన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు అట్టహాసంగా నిర్వహించి కనీసం విద్యార్థుల తల్లులకు ఇచ్చిన తల్లికి వందనం హామీని నెరవేర్చలేదు సరికదా కనీసం విద్యార్థులకు సరైన వసతులు కల్పించే ఆలోచన కూడా చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విమర్శలు మీకు వర్తించవా?

మండలంలోని నిమ్మలపాడు గ్రామానికి ఎన్నికల ప్రచారం సందర్భంగా వచ్చిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి అక్కడ పాకలో నడుస్తున్న పాఠశాలను చూసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు.జగన్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నాశనమవుతోందని ఆరోపించారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలకు కొత్తభవనాలు, మౌలిక సదుపాయాలతో రెండు విడతల్లో పలు పాఠశాలల నిర్మాణాలు పూర్తిచేసింది. మరికొన్ని విడతల్లో మిగిలిన పాఠశాలలు అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఆరోపించిన మంత్రి సంధ్యారాణి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఆరోపణలు ఎవరికి వర్తిస్తాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ గిరిజనులు విమర్శిస్తున్నారు.

రైలు రాకకోసం ఎదురుచూపులు

అలాగే సాలూరు పట్టణానికి రైలు వచ్చేస్తోందంటూ రెండు నెలల క్రితం ట్రయిల్ రన్ వేశారు. ఇప్పటికీ ఆ విషయంపై పట్టణ వాసులు ఎప్పుడు రైలు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మంత్రి సంధ్యారాణి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉందని నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



నిమ్మలపాడులో పూరిపాకలో నడుస్తున్న పాఠశాల

తల్లిదండ్రులకు కళ్లకు కట్టిన నాడు-నేడు

నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలు ఏమేరకు బాగుపడ్డాయో విద్యార్థులు, తల్లిదండ్రులకు మెగా పేరెంట్ డే సమావేశంలో అర్థమైందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏ పాఠశాలలో చూసినా నాడు నేడులో జరిగిన అభివృద్ధి తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా కనిపించిందని చర్చించుకోవడం విశేషం.. కనీసం విద్యార్థులకు జగన్‌మోహన్ రెడ్డి అందించిన అమ్మఒడిని ఇవ్వలేని ప్రభుత్వం ప్రచారం కోసం డైవర్షన్ పాలిటిక్స్ విధానాన్ని అనుసరిస్తోందని, అందులోను స్థానిక మంత్రి ఏ సమావేశానికి వెళ్లినా పథకాల కోసం మాట్లాడకుండా నిత్యం జగన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రం అప్పుల పాలైపోయిందని..ప్రస్తుతం చంద్రబాబునాయుడు సంపద సృష్టించే పనిలో ఉన్నారని చెబుతుంటే సమావేశాలకు వచ్చిన జనం మాత్రం సంక్షేమ పథకాలు ఇవ్వకుండా సంపద సృష్టిస్తున్నారా? అంటూ ఆమె వెనుకగా ఎద్దేవా చేయడం నియోజకవర్గంలో సర్వ సాధారణమైపోయింది. ఎన్నికల సమయంలో ఇది చేస్తాం అది చేస్తాం అంటూ మంత్రి సంధ్యారాణి హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీల విషయంలో కనీసం స్పందించడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టుచెన్నూరు పంచాయతీ చెన్నూరు గ్రామం వెళ్లినప్పుడు ఈ గ్రామానికి రోడ్డు మంజూరు చేస్తామని బీరాలు పలికిన ఆమెకు ప్రస్తుతం ఆ విషయం గుర్తుందో లేదోనని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మరింత చేరువగా 'సంకల్పం'



సంకల్ప ప్రచార రథంను వీక్షిస్తున్న యువత, విద్యార్థులు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్‌శాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాన్ని ప్రచార రథంతో ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఒక కూడలిలో వాహనాన్ని నిలిపి, డ్రగ్స్ వినియో గం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు. తోటపాలెం కళాశాల వద్ద వా హనాన్ని నిలిపి, మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాలు ఏ విధంగా ఛిద్రమవుతున్నాయో తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను సోమవారం ప్రదర్శించారు. వీటిని యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తిలకించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రసన్నకుమార్, కిరణ్‌కుమార్‌నాయు డు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లోనే 'రెవెన్యూ' వినతులు సమర్పించాలి

విజయనగరం అర్బన్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు రావద్దని, సంబంధిత గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లోనే వినతులు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లోనే చదివి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని, వాస్తవ పరిస్థితులను వివరించి ప్రజల ముందే సమాధానం చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సమయాన్ని వృథా చేసుకొని రానవసరం లేదని, రెవెన్యూ సదస్సుల్లోనే చక్కటి పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు.